# అడ్డదోవలకాడ అందురూ వొగిటే!

"ఇదేందమ్మా ఈ మొగోడు?... ఈ బూప్రెపంచంలో రాసేదానికి ఏమీ లేనట్టుగా తనకింక ఏమీ రానట్టుగా 'మా బాశాలి!... మా బాశాలి!' అంటా నా మింద పణ్ణాడే? నెత్తిన దుగ్గాణ్ణి పెత్తే దమ్మిడిగ్గాడా కొరగాని ముండ మోపుల్ను ఎత్తి నెత్తిన పెట్టుకుణ్ణెంత కాలం పెట్టుకోని యిప్పుడు నన్నెత్తి యీదిలో పెట్తా ఉండాడే? పెత్తే పెట్నీ!... నాకేం? ఈ వగాతగాలేని మాట్లు ఎంతమంది సదగబోతారు. చదేవేసి ఈయనకొక కుచ్చుల కుళ్లాయి పెట్టబోతారు. నేను చూడబోతాను! అయినా తలకాయిలో పేను! దాన్నెత్తి అడిగితే చెప్తింది– సంసారం గుట్టు. యాది రట్టని. ఈ మాత్రం ఈకారివేదికి తెలవకుంటే యింటికొక్క పొయ్యుంటిందని చదువుకున్నోళ్లకు తెల్దా? అబ్బరంగా బిడ్డపుట్నాడు. గెడ్డపారెత్తుకోండి చెవులు కుడ్తాం? అన్నెట్టుగా లోకానికంతా నేనే ఈమొగోణ్ణి సతాయించి చట్లో పెట్టేటట్టుగా వుండాదే?

కొంచిం ఎచ్చూ తక్కవగా జామురేత్రి అయ్యుంటింది. చలికాలం. నిద్దర లేస్తానే నీళ్లు కరస్తావుంటాయి. తెల్లారే కుందికి కర్సే చన్నీళ్లల్లో చెయ్యిపెట్లేక ఆయరవకాడ బోకులెత్తి చుట్టారా ఏసుకోని మా బాశాలి ఏకపాత్రాబినయం చేస్తా ఉండాది. నిజిం చెప్పొద్దా? చుట్టారా కుండా చట్టి. నడిమిద్దె కుదురుగా కూసోని తాను. పిల్లలకోడి మాదిర్తో చూడముచ్చటగా వుంటే చూస్తా నిలబడుకుణ్ణా. ఆమె పాతర్లు తోమేది యిడ్సిపెట్టేసి నన్ను తోమేదానికి మొదులుబెట్టె!

పాత్రయితే తోమేకుందికీ నునుపు దేల్తింది. ఆ నునుపు మింద బలే మెరుపొస్తుంది. అదే మణిసి అయితే? ఒళ్లంతా మంట పుట్తింది!

ఆ మంటకు తట్టుకోలేకుండా మెలికలు తిరిగిపోతా 'యింట్లోగెల్సి...' అని గుణస్తా ఉంటే ఆ మాట చెవల్లో పడిందో లేదో? ఆపె సివ్వమాదిర్తో పైకిలేసె.

''ఎట్లెట్లా? ఏందేంది? యింకొకసారి కుయ్ ఆ కూసిన కూత. ఇంటగెల్సి రచ్చ గెలవాలనుకున్నావా? ఎదా? నీకు దయిర్నం ఉంటే నా మొకాన్ని చూసి కుయ్ ఆకూత!''

మా యింటామె పైపంటితో కింది పెదాన్ని కొరకతా వుంటే... ఆ కండ్లల్లో అగ్గి కురస్తా ఉంటే... మణిసి పూనకం పూన్నెట్లు ఎనిక్కీ ముందుకు ఊగిపోతా ఉండాది. ఏందైనా ఎచ్చా తక్కువ అనుకోనట్టుగా జరిగిపోక ముందే ఎందుకైనా మంచిదని-

మంచాన పడుండే మాయమ్మను తల్సుకున్నా! సొరగలోకంలో ఉండే మా అయ్యను తల్సుకున్నా. నాకు అచ్చిరాలు రుద్దబెట్టిన అప్పావుపిల్ల అయ్యోర్ని తల్సుకున్నా!... నా సావాసకాపు దామోదరనాయుణ్ణి తల్సుకున్నా! కడాన కాపరానికొస్తా కరేపాకుమండ తేలేదని కారాలు మిరాలు నూరి కట్టుకున్నె పెండ్లాంతో కాపరం చెయ్యకుండా కొండల్లో కులకతావుండే ఏడుకొండలోణ్ణి తల్సుకున్నా! ఎవ్వరైనా ఒకరు తటిక్కుమని ఆపె మణుసులో దూరి ఈ గెండాన్నుంచి నన్నట్లా గెట్టెక్కిచ్చేస్తారేమో? అని. ఏమీలాబం లేకుండా నేను మినకరిస్తా నిలబడుకోనుంటే-

''నువ్వుగాదే? ఈ బూప్రెపంచంలో యిద్దో యిట్లావమాదిర కతల్రాస్తా కవిత్తాలురాస్తా! అనే ఏ యదవన్నా యింతేనే. పెండ్లాం మొకంలోకి చూసి నిజించెప్పలేడే? పుట్నిల్లు మేనమామకు తెల్దా అన్నెట్లు నీకతా నాకు తెల్దు?''

''నన్ను... నన్నంటే అన్నావుగానీ అందుర్నీ వరసబెట్టి వొగ్గాట్లో...'' అని నసగతా ఉంటే అంటుకున్నింది చూడండి మహన్నబావుల్లారా!

''ఎవుడో నూటికో కోటికో ఒక మహన్నబావుడుండనే ఉంటాళ్లే. అటుమంటోళ్లు ఎయ్యిగెంజాయి మొక్కల్లో ఒక రోజామొక్క మాదిర్తో ఉండంగానే పొద్దుపుట్టి తెల్లార్తా వుండేది. వాళ్లకతలు యిప్పుడెందుకులే? పొరంబోకెదవలు!... రాసేదొగిటి. కూసేదొగిటి. మల్లా చేసేదొగిటి!''

దెయ్యం పట్నెట్లు మణిసి శానా ఊపు మింద ఉండాది. ఆ ఊపులో ఏ కుండో చట్టో చేతికొస్తే? ఆ మూతీ ముంపూ చూస్తా ఉంటే ఆపొద్దు నాకేందో కీడు మూడేటట్టుగానే ఉండాది. చిక్కి బిక్కిరించే దానికంటే ఎనిక్కుండి ఎక్కిరించేది మేలు. ఎందుకైనా మంచిదని ఎనుకూ ముందు చూడకుండా గడప దాటేసినా!

నేను గడప దాటేసినా మా అయ్య మా అమ్మ నన్ను దాటుకోని పోలా. ఈ పొద్దిటిగ్గాడా మా ఊళ్లో నన్ను చూసినోళ్లంతా 'ఒరే ఒరె! యీడంతా వాళ్లమ్మను

వొల్సుకోనొచ్చినాడ్రే!' అని అంటా ఉంటారు. ఒకేళ రూపురేకల్లో ఉంటే ఉండచ్చునేమోగానీ నిజిం చెప్పోద్దా? నాది మాత్రం అచ్చంగా మా అయ్యసాలే! ఎందుకంటారేమో?-

మా అయ్యగూడా యింతే. అంతా నామాదిరిగానే. బయిటంతా పులి. ఇంట్లో అడుగుపెడ్తే పిల్లి. మా యమ్మగానా నోరు తెర్సిందంటే మా అయ్యకంటే అయ్యోరి ముందర మడిచేతులు కట్టుకోని నిలబడుకుండే పిలగాడే మేలుగదా?

మా అయ్యను మా యమ్మగానా పైనబడి కర్సినట్టు అరస్తావుంటే నాకు శానా కుశాలగా ఉండేది. ఎందుకుండదు? ఎపుడికైనా ఉంటింది. ఆయనే పుడ్తా పుడ్తా వాళ్లమ్మ కడుపులోనుంచి నేర్సుకోనొచ్చిన పెద్ద మొగలాయి మాదిర్తో యింతకంతకు చట్లోబెట్టి సాగదీస్తా ఉంటే? ఉండదా?

దుర్గంరాజుల కయ్యల్లోనో అంగిడోళ్ల పాదుల్లోనో మడకలుగట్టి దున్నతా ఉంటాం. మా అయ్య ముందు మడక. నేను ఎనక మడక. ఎనక మడకైతే సాలు పక్కన సాలు పట్టేది సలీసు. అదే ముందు మడకైతే కొండ్ర ఏసేదానికి కొంత అనుబోగం ఉండాల. ఆ అనుబోగం నాగ్గూడా రావాలగదా? అదెంతా ఆలోచించకుండా మాఅయ్య ఉణ్ణెట్టుండి దున్నతావుండే మడకలు నిలబెట్టేస్తాడు. ఆయన ఎనక మడక కాడికొచ్చి నన్నుపాయ్ ముందు మడక పట్టుకోరా అంటాడు. బయిపడ్తా బయిపడ్తా ముందు మడక పట్టే 'కొండ్రెయ్‌రా!' అంటాడు. లోబెరికి ఎలిబెరిగ్గానే కొండ్రేస్తా. కొండ్రేస్తానే- 'నిలపరా మడక!' అంటాడు. మడక నిలబెట్టతానే 'తిరిగిసూడ్రా!' అంటాడు. తిరిగిచూస్తే దాని రాత ఆడికే తెల్లారుంటింది. అదర్తా బెదర్తా చేసిన పనిగదా? ఆ సాలు ఎద్దుచ్చులు పోసినట్టుండేది. అప్పుడు మా అయ్య నవ్వతా నవ్వతానే ముందిరి మడక్కాడి కొస్తాడు. ఆ మడక పట్టుకుంటానే కారి నా మొకాన ఊస్తాడు.

మొకమంతా ఎంగిలి. తుడ్సుకుందామంటే తుండుగుడ్డ గూడాలే. ఏసుకోనుండేది జానాబిత్తెడు నిక్కర సొక్కాయేగదా? గుడ్డల్లో నీళ్లకమ్మతా ఉంటాయి. ఆ! అనే దానికిలే. ఊ! అనే దానికిలే. ఈడ్సి కొలిస్తే మేడెత్తులేనే. ఏం జెయ్యాల? ఆ మేడి పిడికల్లానే చూస్తావుంటే-

''నీయమ్మా అగుముడి నాకొడకా! కొండ్ర! ఏస్తే ఎట్టుండాల్రా? మల్లా సదగతా ఉండావే? కాగాతం మింద ర్యూళ్లకర్ర బెట్టి గీత గీసినట్టుండొద్దా? పోరా పో!... చేతికి చిప్పెత్తుకోని తూరుపుగా పో. సరికిసరి పెట్టారంట. చిప్పడు పెరికితే చిప్పడు జొన్నలు. అలుపూసొలుపూ లేని యాపారం గదా? పోరా పో!''- అంటా చీ కొట్టేవాడు!

ఏమి పెరికితే ఏంది సరికిసరి పెట్టారో అప్పుడైతే తెల్లేదు గానీ గుడ్డమింద కమ్మిన నీళ్లు మాత్రం జొన్నగింజిలు రాల్నెట్టు పలపలరాలేవి.

అందుకనే అప్పుడప్పుడూ మాయమ్మ మాఅయ్యపైన బడి 'అదిట్టపాయ.

యిదిట్టయ్‌పాయ!' అంటా యిదిలించి కొట్టావుంటే నాకసి అంతా తీరిపాయ్ నట్టుండేది. అటువంటి సమయాల్లో నేను గూటంకొండ కుప్పమింద కూసుణ్ణెంత కుశాలపడ్తా ఉంటే-

''ఒరే నా కొడకా! కడవడంత గుమ్మిడికాయ అయినా కత్తిపీటకు లోకవేరా. రేపు నీగ్గూడా పెండ్లాం రాకుండా బోతిందా? అప్పుడు నీకత చూడకుండా బోతానా? '' అన్నెట్టుగా మా అయ్య నాకల్లా చూసి నవ్వేటోడు.

ఈ పొద్దుగానా ఆయన బతికే ఉంటే... యింత కంతకు మా బాశాలి నామింద ఎగిరెగిరి పడేది ఆయన కండ్లల్లోగాన పడుంటే... ఆపె నీలుగుడుకు నేను నీళ్ల నమల్తా ఉంటే-

''ఇప్పుడు నీగెతి ఏమయిందిరా కొడకా!'' అంటా కుశాలపడేవాడేమో? మాయమ్మ మ్మాఅయ్యల కీచులాట కండ్ల ముందర మెదిలినట్టుంటే అడుగుమింద అడుగ్గా ఎప్పుడొచ్చినానో ఏమో నాలుగ్గాళ్లమండపం కాడి కొచ్చేసినా.

జాము రేత్రికి పైబడింది.

ఆ యాళకాడ వాడెవుడో ఒకడు ఆడ పడీపడీ యాడస్తా ఉండాడు. కిందపడ్తాడు పైకిలేస్తాడు. పరిగిత్తా నాలుగ్గాళ్లమండపం కాడికి పోతాడు. ఆ మండపానికి మొక్కతాడు. ఆమండపం మింద రెపరెపలాడ్తా ఉండే జండాకల్లా తలపైకెత్తి చూస్తాడు. తుపుక్కుమని ఊస్తాడు. మల్లా బోరోమని ఏడస్తాడు.

ఇదేందిది? కుమ్మెత్తుకోని గూడూరికి పోతే ఏడుకుమ్ములు ఎదురుంగా వచ్చినట్టుండాదే కత! అనుకుంటానే ఉండబట్టలేక 'ఏమిరా? అబ్బోడా!' అంటి. అంతే! వాడు లొటక్కమని నా రొండుకాళ్లు జవిరిపటేసి ఊరూనాడూ వొగిటై పొయ్యేటట్టుగా గొంతెత్తి!

'ఒరేవొరే! ఉండ్రా అబ్బోడా!' అంటా వాణ్ణి పట్టి పైకి లేపితి. బుజంతట్టి బుజ్జగిస్తి. ఏమనుకుణ్ణాడో ఏమో? వాడు ఏడుపు నిలిపె. ఎగాదిగా చూసె. నా రొండు చేతులు వొడిసి పట్టుకుండె. వాడి కండ్లల్లో కండ్లుబెట్టి చూస్తా ఉంటే-

''అన్నా! మొన్నొకనాడు. తెల్లారీ తెల్లారకముందే యదాపకారంగా యీడికొచ్చినా. ఎవురైనా వొచ్చి పిలిస్తే పనికి పోదామని ఎదురుసూస్తా ఉండా. అప్పుడు ఎదురు సూణ్ణట్టుగా లారీ వొగిటొచ్చె. ఇద్దో సత్తింగా యీణ్ణే నిలబడె. నిలబడీ నిలబడకముందే కండసుట్టూ కాకులు సుట్టుకుణ్ణెట్టు జనం ఆ లారీని సుట్టుకుండ్రి.

'ఎక్కండ్రా ఎక్కండి! తొరతొరగా ఎక్కండి' అని పురమాయించిరి.

'ఏం పనయ్యా?' అనడిగితే-

''ఏం పనైతే మీ కెందుకురా? పిల్సి పిల్లనిస్తానంటే కులమేమి? గోత్రమేమి? అనే

బుద్దులు పోలేదే మీకు? వడ తినమంటే తూటెందు కంటే ఎట్రా? చెప్పిన పని చెయ్యండి. మీ కూలీ మీరు తీసుకోండి?''

''అది గూడా నిజిమే గదా? కూసోబెట్టి కూలిచ్చేది లేదు. అలివిమాల్నె పన్లు అంటగట్ట బొయ్యేది లేదు. సెప్పిన పని సేస్తాం. సెయ్యి సాపతాం. కూలిదుడ్లు సేతిలోపడ్తే సాలు'' అని మాట్లాడుకోని అందురు బిలబిల లారీ ఎక్కేసిరి.

లారీ ఎలబారె. అది పాయ పాయ: ఆగమేగాలమింద ఆడేణ్ణో వుండే పడమటి రాజ్జానికి పాయ. ఆడ నిలిపి 'దిగండ్రా' అంటే దిగితిమి.''

అచ్చిరం పొల్లుపోకుండా కత చెప్పినట్టు చెప్తా ఉణ్ణోడు యింక చెప్పలే నన్నెట్టుగా నిలబడిపాయ. నాయాలు మంచి సస్పెన్సులో పెటేసెనే అనుకుంటా ఉంటే- మల్లా అందుకుండె ఏడుపు. ఏడుపా? అది యిట్టాఅట్టా ఏడుపుగాదు. తల్సుకోని తల్సుకోని యాడస్తా ఉండాడు.

వాణ్ణి సుదారించే కుందికి చుక్క నడిమిట్టకొచ్చె!

''అన్నా! ఆడికి తీసుకోనిపాయ్‌రి. నాపేరు మార్చేసిరి. నేను బాదపల్లా. ఊరుగూడా మార్చేసిరి. దానిగ్గూడా బాదపల్లా. కడాన అబ్బనుగూడా మార్చేసిరి. తలకోటేసినంత పనైపాయ. అయినా తమాయించుకుంటి. ఎందుకంటారా? ఏంజేస్తే నాకేమి? ఏమయితే నాకేమి? నాగ్గావాల్సింది కూలిదుడ్లేగదా?'' అనుకుంటి.

'పోరా పో! పాయ్ ఓటేసి రాబోరా!' అని.

సెప్పిన పని అచ్చిరాలా సేసేసి వొస్తి.

వొస్తే ఏం జేసిరి? పది రూపాయిలు జేబీలో పెట్టి పాకెట్టాగిటి సేతికిస్తారా? ఆ వొక పాకెట్టు యాడికి సాల్తింది నువ్వే చెప్పన్నా? అలవాటు పణ్ణె పాణం గదా? వాసన తగిల్తే యింకది వొదిలిపెట్తిందా? ఉణ్ణిందీ పాయ. ఉంచుకుణ్ణిందీ పాయ. అన్నెట్టుగా వాళ్లిచ్చింది... ఆ యరవకు పావలా పరకా సేతిలో ఉణ్ణింది... పాయ గదన్నా! అంతా ఊడ్చుకోని పాయగదన్నా! ఈ సేత్తో యిచ్చినట్టిచ్చి ఆ సేత్తో గుంజుకుండ్రి. తమాసగా ఉండ్లా. పోనీలే. గెవర్నమెంటోడిది వాడికే సేరిపాయ. ఇంక కొంప సేరేదెట్టని పొగబండి గెవర్నమెంటోడిదే గదాని ఆ బండెక్కితే వాడెవుడో నాయాలు యాడతడిమి ఆడ తడిమి సేతికేమీ తగలకుండా బొయ్యే కుందికి నాలుగు తన్నిడ్సిపెట్టె. ఇంటికిబోతే యింట్లోడ్డి దేన్తోతంతుందో?'' అంటా వాడు బోరోమని ఏడుపు అందుకుండె!

ఎలక్సన్లప్పుడు సారాయి పాకెట్లు లారీలకు లారీలు తోల్నారని... అట్టా మాదిరి తోలక పోతావుంటే అవ్వి జారి దారిపాడగనా పణ్ణాయని వాళ్లూ యాళ్లూ అంటావుంటే యివన్నీ కడుపుమంట కతల్లే అని అనుకుంటా ఉంటి. తీరా యిప్పుడు యింటావుంటే యీళ్ల దూము యీళ్లకు దగల! యిటుమంటి వాళ్లకు తిరక్కుండా పోతిందా? అయినా

ఈ దరిద్రపు నాయాలిగుంపు శాతల్లో ఆ చిల్లరదుడ్లు సారాయిబుడ్లు ఉణ్ణంటే యీళ్లంతా యిట్టాంటి పొరంబోకు పన్లకు పాలుమారబొయ్యేది లేదుగదా! అది తెల్సుకొనే గదా ఆ దుడ్లు వాళ్ల దగ్గిర్నే యిరుపు పెట్టుకుణ్ణారు. ఇరుపు ఉండాది కాబట్టి అవసరానికి వాడుకుంటా ఉండారు. ఇంక ఎప్పుడబ్బా ఈ దేశిం బాగుపడ బొయ్యేది?'' అని వగస్తా ఉంటే ఆ యాళకాడ ముత్తారెడ్డన్న ముందు కొచ్చి నిలబడె!

''ఒరే అబ్బోడా! వాడి బాదంతా యింటి. నీ బాదా అర్తం చేసుకుంటా ఉండా. ఇదింతేరా నాయినా యింతే! వాయల్పాడులో జరిగినా అది వరంగల్లులో జరిగినా... కాళాస్త్రిలో జరిగినా అది కాశిలో జరిగినా యిది యింతేరా అబ్బోడా యింతే! దేశింలో యిన్ని పార్టీలుండాయి గదా? నీది తప్పంటే నీదే తప్పని వాదులాడుకుంటా ఉండారు గదా? కడాన ఆడి కొచ్చే కుందికి- యాడికొచ్చే కుందికి? ఓట్లు ఎయ్‌పించుకుండే కాడి కొచ్చేకుందికి అందురూ వొగిటై పోతా వుండారు. అడ్డదోవలకాడ అందురూ వొగిటే కానీ నువ్వు పదరా అబ్బారే?'' అనె.

అవును. అడ్డదోవల మింద పణ్ణాననే గదా ఈ పొద్దు యింట్లో యిమడలేకుండా బతుకిట్టా చిమిడిపోతా ఉండేది. అడ్డదోవన పొయ్యేగదా ఈడెవుడో యీదిలోబడి యిట్టా అల్లాడ్తా ఉండాడు. ఇట్టా మాదిర అడ్డదోవల మింద పడే యదవలకాళ్లు యిరగ్గొట్ట బొయ్యేకాలం వచ్చేదెప్పుడబ్బా? ●